డ్రైనేజీ పనులు ప్రారంభం

యాకుత్‌పురా: రెయిన్‌బజార్‌ డివిజన్‌లోని యశ్రఫ్‌నగర్‌లో యాకుత్‌పురా ఎమ్మెల్యే జఫర్‌ హుస్సేన్‌ మేరాజ్‌ కార్పొరేటర్‌ మహ్మద్‌ వసీవుద్దీన్‌తో కలిసి డ్రైనేజీ పైపులైన్‌ పనులను బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మజ్లిస్‌ నాయకులు, జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు స్పందన

గోల్కొండ: బీజేపీ సభ్యత్వ నమోదుకు అనూహ్య స్పందన వస్తున్నదని తెలంగాణ బీజేపీ కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్‌ అన్నారు. గుడిమల్కాపూర్‌లో బుధవారం జరిగిన కిసాన్‌ మోర్చా పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా బీజేపీదే అధికారం అని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రజా, రైతు వ్యతిరేక విధానాల వల్ల విశ్వాసాన్ని పొందలేకపోతుందన్నారు. యాదగిరి, శ్రీకాంత్‌సాగర్‌ ఉన్నారు.

గుర్తు తెలియని మృతదేహం



లంగర్‌హౌస్‌: లంగర్‌హౌస్‌లోని అలంకార్‌ థియేటర్‌లో ఓ వ్యక్తి మృతదేహం కలకలం సృష్టించింది. థియేటర్‌ ప్రాంగణంలో బుధవారం ఓ వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు కొందరు డయల్‌ 100కు సమాచారం అందించారు. దీంతో లంగర్‌హౌస్‌ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కాగా వివరాలకు 8712661272, 8712660432 నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు సూచించారు.

డాక్టర్‌ షోయబ్‌కు సన్మానం

గోల్కొండ: టోలిచౌకీ సాలార్‌జంగ్‌ కాలనీలోని సాఫ్‌ కిడ్నీ సెంటర్‌కు అంతర్జాతీయ స్టాండర్డ్‌నేషన్‌ గుర్తింపు లభించింది. దీంతో కిడ్నీ సెంటర్‌లో బుధవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షాహీన్‌ గ్రూప్‌ అధినేత డాక్టర్‌ అబ్దుల్‌ ఖదీర్‌ ప్రముఖ నెఫ్రాలజిస్ట్‌ సాఫ్‌ కిడ్నీ సెంటర్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ మహ్మద్‌ షోయబ్‌ అహ్మద్‌ ఖాన్‌కు ప్రశంసాపత్రం అందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెంటర్‌ స్థాపించిన అనతి కాలంలోనే ప్రజల మన్నన పొందడం అభినందనీయమన్నారు. సాఫ్‌ గ్రూప్‌ చైర్మన్‌ డాక్టర్‌ మహ్మద్‌ నియాజ్‌ అహ్మద్‌ ఖాన్‌ మాట్లాడుతూ లాభాపేక్ష లేకుండా సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో షాదాన్‌, షాహీన్‌ గ్రూప్‌ సలహాదారు డాక్టర్‌ రఫీక్‌ఖాన్‌, సాఫ్‌ మెనేజింగ్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ మహ్మద్‌ ఆఖీబ్‌ అహ్మద్‌ ఖాన్‌ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే



మంత్రి పొన్నం ప్రభాకర్‌తో సమావేశమైన ఎమ్మెల్యేలు కౌసర్‌, మహ్మద్‌ ముబీన్‌

గోల్కొండ: కార్వాన్‌ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్‌ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బుధవారం కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పెండింగ్‌ పనులు, పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వరద నీటి, డ్రైనేజీ పైపుల పనులు నత్తనడకన సాగుతున్నాయని సత్వరమే పూర్తయ్యేలా చూడాలని కోరారు. నిరుపేదలు నివసించే బస్తీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, నాలాల ప్రక్షాళన చేయాలని విన్నవించారు. శాతం చెరువులో వరద ప్రమాదస్థాయికి చేరిందని, అదేవిధంగా బుల్కాపూర్‌ నాలా సైతం పూడికతో అధ్వానంగా తయారైందన్నారు. నియోజకవర్గంలో పర్యటించాలని మంత్రిని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. ఆయన వెంట ఎమ్మెల్యే మహ్మద్‌ ముబీన్‌ ఉన్నారు.

మండపాలకు గణనాథులు..!

- ధూల్‌పేట్‌లో జోరుగా కొనుగోళ్లు
- ఫీటు నుంచి 20 ఫీట్ల వరకు అందుబాటులో
- షోలాపూర్‌ విగ్రహాలకు భలే గిరాకీ
- వాహనాల్లో తరలిస్తున్న నిర్వాహకులు
- మరోవైపు గంటల తరబడి ట్రాఫిక్‌ జామ్‌



అబిడ్స్‌ / జియాగూడ: గణేశ్‌ నవరాత్రుల ఉత్సవాలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ధూల్‌పేట్‌లో వినాయక విగ్రహాల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. నగరం నుంచే కాక ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి సైతం మండపాల నిర్వాహకులు పెద్ద ఎత్తున భారీ వాహనాలతో ధూల్‌పేట్‌కు తరలివస్తుండడంతో ధూల్‌పేట్‌ సందడిగా మారింది. కొనుగోలు చేసిన విగ్రహాలను మండపాలకు తీసుకెళ్తుండడంతో మరోవైపు ట్రాఫిక్‌ జామ్‌ ట్రాఫిక్‌ నెలకొంటున్నది. గతంలో మాదిరిగా వన్‌ వే పద్ధతిని అమలు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ధూల్‌పేట్‌కు భారీ వాహనాలు..

ధూల్‌పేట్‌లో గణేశ్‌ విగ్రహాలు ఫీటు నుంచి 20 ఫీట్ల వరకు తయారు చేశారు. వీటిని మండపాలకు తరలించేందుకు భారీ వాహనాలు, క్రేన్లు సైతం ధూల్‌పేట్‌కు చేరుకున్నాయి. దీంతో వందల వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. ముఖ్యంగా గంగాబ‌ౌలి, దర్జీగల్లీ, పురానాపూల్‌, గాంధీబొమ్మ, మంగళ్‌హాట్‌, జాలీ హనుమాన్‌, అప్పర్‌ధూల్‌పేట్‌, మంగళ్‌హాట్‌ పోలీస్‌స్టేషన్‌, సీతారామ్‌బాగ్‌ చౌరస్తా, ఆసిఫ్‌నగర్‌లో వాహనాలు నిలిచిపోతున్నాయి.

ఆకట్టుకుంటున్న షోలాపూర్‌ విగ్రహాలు..

ధూల్‌పేట్‌కు వేలాది చిన్న గణపతులు కూడా చేరుకుంటున్నాయి. ముఖ్యంగా షోలాపూర్‌ గణపతులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. కొనుగోలుదారులు సైతం కుటుంబాలతో వచ్చి షోలాపూర్‌ గణపతులను కొనుగోలు చేస్తున్నారు. వీటి ధర రూ.250 నుంచి రూ.1000, రూ.1500, రూ.2500 సైజులను బట్టి ధరలు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికే 20 ఫీట్ల భారీ గణపతులు జిల్లాలకు తరలుతుండగా, ఇంకా వేలాది గణనాథుల విగ్రహాల విక్రయాలు పండుగరోజు రాత్రి వరకు జరగనున్నాయి.



మండపాలకు తరలుతున్న వినాయక విగ్రహాలు



ధూల్‌పేట్‌లో ట్రాఫిక్‌ జామ్‌

నవరాత్రులను ప్రశాంతంగా జరుపుకోవాలి



చార్మినార్‌: గణేశ్‌ నవరాత్రులను ప్రశాంతంగా జరుపుకోవాలని మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్‌ నాగ దుర్గ ప్రసాద్‌ సూచించారు. శశాంక్‌ తివారీ అండ్‌ టీం ఆధ్వర్యంలో ఓల్డ్‌ సిటీ కే రాజా పేరుతో వినాయక విగ్రహాన్ని బుధవారం మండపానికి తరలించారు. గ్రాండ్‌ ఆగమన్‌ అంటూ భాజా భజంత్రీల నడుమ లాల్‌దర్వాజ మోడ్‌లోని దమయంతి తివారీ టవర్స్‌ వద్దకు సామూహిక ఊరేగింపుగా తరలించారు. దారిపొడవునా బాణాసంచా కాల్చుతూ జై బోలో గణేశ్‌ మహారాజ్‌ కీ..జై అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం జరిగిన పూజా కార్యక్రమాల్లో సుల్తాన్‌షాహీ జగదాంబ ఆలయ కమిటీ చైర్మన్‌ రాకేశ్‌ తివారీ, శశాంక్‌ తివారీతో కలిసి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక



సత్యవతి (రిటైర్డ్‌ గెజిటెడ్‌ హెడ్‌మాస్టార్‌)

నాంపల్లి: రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ అవార్డుకు అరెపల్లి వెంకట సత్యవతి ఎంపికయ్యారు. నగరంలోని రవీంద్రభారతీ వేదికపై గురువారం జరగనున్న గురుపూజోత్సవం వేడుకల్లో ఆమె అవార్డు అందుకోనున్నారు. ఈమె నాంపల్లి మండల పరిధిలోని సుల్తాన్‌బజార్‌ నయా బజార్‌ ప్రభుత్వోన్నత పాఠశాలలో గెజిటెడ్‌ ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తూ జులైలో రిటైర్డు అయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఏవీ సత్యవతి 1989వ సంవత్సరంలో ఏపీపీఎస్సీ ద్వారా స్కూల్‌ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు. అనంతరం హైదరాబాద్‌ జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో గణిత శాస్త్ర ఉపాధ్యాయురాలిగా బోధన చేశారు. ఈ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని ఆమె ఆనందం వ్యక్తం చేశారు.

జేఎన్‌ఏఎఫ్‌ఏయూ అధ్యాపకుడు



ప్రొఫెసర్‌ ఎం.వినోద్‌ గణేశ్‌

విజయనగర్‌కాలనీ: మాసబ్‌ట్యాంక్‌ జవహర్‌లాల్‌ నెహ్రూ ఆర్కిటెక్చర్‌ అండ్‌ ఫైనార్ట్స్‌ యూనివర్శిటీలోని ఆర్కిటెక్చర్‌ కళాశాల అకాడమిక్‌ అండ్‌ ప్లానింగ్‌ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రొఫెసర్‌ ఎం.వినోద్‌ గణేశ్‌కు ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు వరించింది. ఈ సందర్భంగా బోధన, బోధనేతర సిబ్బంది ఆయనను బుధవారం యూనివర్శిటీ ప్రాంగణంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వినోద్‌ గణేశ్‌ మాట్లాడుతూ.. అవార్డులు మరింత బాధ్యతను పెంచుతాయని, విద్యార్థులకు ఉన్నత విలువలతో కూడిన గుణాత్మకమైన విద్యను అందించి విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు కృషి చేస్తానన్నారు.

ఫ్లై ఓవర్ల కింద ఇరుక్కుపోయిన గణనాథుడు



చాంద్రాయణగుట్ట ఫ్లై ఓవర్‌ కింద ఇరుక్కున్న గణనాథుడు

చాంద్రాయణగుట్ట: మండపాలకు తరలుతున్న బడా గణనాథులకు ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్లపై వెళ్తున్న సమయంలో అడ్డుగా వస్తున్న వైర్లను కర్రల సాయంతో పైకి లేపుతున్నప్పటికీ, ఫ్లై ఓవర్ల వద్ద మాత్రం అతికష్టం మీద రోడ్డు దాటాల్సి వస్తోంది. ఈ క్రమంలోనే చాంద్రాయణగుట్ట నూతన ఫ్లై ఓవర్‌ కింద బడా గణనాథుడు బుధవారం ఇరుక్కుపోవడంతో బయటకు తీసేందుకు నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొంత మంది యువకులు పైకి ఎక్కి గణనాథుడికి చక్రాన్ని నెమ్మదిగా తొలగించడంతో ముందుకు వెళ్లగలిగారు. కాగా బాలాపూర్‌ నుంచి పాతబస్తీలోకి వచ్చే గణనాథుడి నిమజ్జన శోభయాత్రను ఫ్లై ఓవర్‌ కింది నుంచి కాకుండా పక్క నుంచి తీసుకెళ్లి ఫ్లై ఓవర్‌ ముగిశాక యూటర్న్‌ తీసుకుని రానున్నారు.

కేన్సర్‌ ఆసుపత్రిలో అన్నదానం

నాంపల్లి: షైనీ వేవ్‌ చారిటబుల్‌ సొసైటీ ఆధ్వర్యంలో రెడ్‌హిల్స్‌లోని ఎంఎన్‌జే కేన్సర్‌ ఆసుపత్రిలో బుధవారం సుమారుగా 500 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమానికి సహకరించిన ఆసుపత్రి యాజమాన్యం, సొసైటీ సభ్యులకు సొసైటీ అధ్యక్షుడు డాక్టర్‌ ముస్తఫా కృతజ్ఞతలు తెలిపారు.



అన్నదానం చేస్తున్న ప్రతినిధులు

గోషామహల్‌లో ఉస్మానియా ఆసుపత్రి నిర్మించొద్దు



అబిడ్స్‌: గోషామహల్‌ పోలీస్‌ గ్రౌండ్స్‌లో ఉస్మానియా ఆసుపత్రిని నిర్మిస్తే స్థానిక వ్యాపారులు రోడ్లపాలవుతారని గోషామహల్‌ ట్రేడర్స్‌ అసోసియేషన్‌ చైర్మన్‌ సతీశ్‌ రెడ్డి, అధ్యక్షుడు బిజిని శ్రీనివాస్‌ పేర్కొన్నారు. బుధవారం గోషామహల్‌లో గోషామహల్‌ ట్రేడర్స్‌ అసోసియేషన్‌ మీడియా సమావేశం నిర్వహించి ఆసుపత్రి వద్దంటూ వెల్లడించారు. కార్యక్రమంలో వ్యాపారులు ఎం.రమేశ్‌, రాజ్‌కుమార్‌, వెంకటేశ్‌ గుప్తా, విజయ్‌ అగర్వాల్‌, మనోజ్‌, రాజేశ్‌, శ్రీశైలం, మనీశ్‌, మహేందర్‌, ప్రవీణ్‌కుమార్‌ పాల్గొన్నారు.

గణేశ్‌ మండపానికి కర్ర పూజ

గౌలిపురా: గౌలిపురా చౌరస్తాలోని శ్రీ భాగ్యనగర్‌ గణేశ్‌ ఉత్సవ సమితి మండపానికి బీజేయూఎస్‌ సభ్యుడు బుధవారం కర్రపూజ చేసి మండప పనులను ప్రారంభించారు. కోల్‌కతా నుంచి వచ్చిన 40 మంది కళాకారులు పనులు చేస్తారన్నారు. నిర్వాహకులు ఎర్మని కైలాష్‌ గంగపుత్ర, జ్ఞానేశ్వర్‌ ముదిరాజ్‌, అల్లి మహేంద్ర గిరి, మధుసూదన్‌ గిరి, ఇ.సుమన్‌కుమార్‌ముదిరాజ్‌, మురళీ పంతులు, బీవై శ్రీకాంత్‌, జమాల్‌పూర్‌ అశోక్‌, కే రాజ్‌ కుమార్‌, అభిజిత్‌, విశాల్‌ తివారీ పాల్గొన్నారు.

యువకులకు జైలు

గౌలిపురా: మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ముగ్గురు యువకులకు నాంపల్లి కోర్టు జైలు శిక్షను విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అహ్మద్‌ అబ్దుల్‌ అజీజ్‌ (20), సయ్యద్‌ సాహెల్‌ (19), మహ్మద్‌ అహ్మద్‌ (19)లు రోడ్లపై అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టులో ప్రవేశపెట్టారు. విచారించిన నాంపల్లి నాలుగో స్పెషల్‌ జ్యుడీషియల్‌ మెజిస్ట్రేట్‌ డీసీ ఉమాపతి రావు ముగ్గురికి ఏడు రోజుల జైలు శిక్షను విధించింది.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభను వెలికితీస్తాం



అబిడ్స్‌: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి..వారు ఉత్తమ ప్రతిభ చాటేందుకు కృషి చేస్తామని ఇంపాక్ట్‌ ట్రైనర్‌ సాలం గాయత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థుల్లో ఎంతో ప్రతిభ దాగి ఉన్నప్పటికీ వారు ఉన్నత శిఖరాలను అధిరోహించలేకపోతున్నారన్నారు. అలాంటి వారిని గుర్తించి..వారు ఒత్తిడికి లోనుకాకుండా చదువుల్లో రాణించే విధంగా తాము అవగాహన కల్పిస్తామన్నారు. విద్యార్థులు ఏఏ రంగాల్లో రాణిస్తారో దానికి అనుగుణంగా తాను నిరంతరం అవగాహన తరగతులు నిర్వహించి ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతామన్నారు. ఇంపాక్ట్‌ క్లబ్‌ ఇంటర్నేషనల్‌ స్థాపకులు గంపా నాగేశ్వర్‌రావు పర్యవేక్షణలో డాక్టర్‌ ఆదినారాయణరెడ్డి ఆధ్వర్యంలో తాను ట్రైనర్‌గా శిక్షణ పొంది ప్రభుత్వ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు గాయత్రి ఇక్కడ విలేకరులకు తెలిపారు.

తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయంలో ‘ఓపెన్‌ డే’

సుల్తాన్‌బజార్‌: కోఠి మహిళా కళాశాల (తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం) శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం చరిత్ర, దాని విద్యా వ్యవస్థను తెలియజేసేందుకు బుధవారం ‘ఓపెన్‌ డే’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్‌ విజ్జులత హాజరై ప్రారంభించారు. ఇందులో భాగంగా విశ్వవిద్యాలయం 31 విభాగాల విద్యార్థులు బోధన అంశాలపై ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. ఇందులో బోధన తీరు, చదివే సబ్జెక్టులు తీసుకోవడం ద్వారా ఇతర విద్యార్థులకు వివరించారు. ముఖ్యంగా న్యూట్రిషియన్‌, సైన్స్‌, తదితర అంశాలపై ప్రదర్శనలు ఎంతో ఆసక్తికరంగా సాగాయి. మూడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, మూడు జూనియర్‌ కాలేజీలు, మూడు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సుమారు 700 మంది పాల్గొని వివిధ ప్రదర్శనలు తిలకించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున విద్యార్థులతో పాటు అధ్యాపకురాలు జ్యోతి, వివిధ విభాగాల ప్రొఫెసర్లు పాల్గొన్నారు.



ప్రదర్శనలను విద్యార్థులకు వివరిస్తున్న విశ్వవిద్యాలయ విద్యార్థి

సట్టా రాకెట్‌ గుట్టు రట్టు

చార్మినార్‌: హుస్సేనీ ఆలం పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని దూద్‌బౌలిలో అక్రమంగా సట్టా నిర్వహిస్తున్న ఎనిమిది మంది నిందితులను అరెస్ట్‌ చేసి వారి నుంచి రూ. 76,150 తో పాటు 42 సట్టా చిట్లు, 4 సెల్‌ ఫోన్లు, క్యాలిక్యులేటర్లు స్వాధీనం చేసుకున్నట్లు నగర టాస్క్‌ ఫోర్సు డీసీపీ తెలిపారు. హుస్సేనీ ఆలంకు చెందిన షేక్‌ ముస్తఫా (49) అక్రమ మార్గంలో డబ్బులు సంపాదించాలనే ఆశతో సట్టా గేమింగ్‌కు తెరలేపాడు. మహమ్మద్‌ సమీర్‌, షేక్‌ మొహమ్మద్‌, మహమ్మద్‌ జాఫర్‌ షేక్‌ సిద్ధిఖీ, అజీం తదితరులతో కలిసి దూద్‌బౌలిలో గదిని అద్దెకు తీసుకుని సట్టా గేమ్‌ నిర్వహిస్తున్నాడు. చిరు వ్యాపారులతో పాటు పాన్‌ షాప్‌ నిర్వాహకులు, ఆటో డ్రైవర్లకు మాయ మాటలు చెప్పి సట్టా గేమింగ్‌ కు ఉసిగొల్పుతున్నాడు. విషయం తెలుసుకున్న హుస్సేనీ ఆలం పోలీసులతో కలిసి దక్షిణ మండలం టాస్క్‌ ఫోర్స్‌ పోలీసులు సట్టా కేంద్రంపై దాడులు చేసి నిందితులను అరెస్ట్‌ చేసి వారి నుంచి నగదు, సెల్‌ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

‘లెక్కలు తేలే వరకు ఎన్నికలు జరపొద్దు’



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఎస్‌కే సమాజ్‌ సభ్యులు

అబిడ్స్‌: ఎస్‌ఎస్‌కే సమాజ్‌లో జరిగిన అవకతవకలను దృష్టిలో పెట్టుకుని వాటి లెక్కలు తేలేవరకు ఎలాంటి ఎన్నికలు జరపవద్దని న్యాయస్థానం ఆదేశాల జారీ చేసిందని ఆ సమాజ్‌ సభ్యులు రతన్‌, మహేశ్‌, నగరి రాధాకృష్ణ, జ్యోతిప్రభు, కోటి రవి పేర్కొన్నారు. రహీంపురాలోని ఎస్‌ఎస్‌కే సమాజ్‌లో బుధవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రూ.1.30 లక్షల నిధులు కాజేయడంతో ఎస్‌ఎస్‌కే సమాజ్‌ కార్యదర్శి కాటిగర్‌ శంకర్‌, కోశాధ్యక్షుడు శివరతన్‌ను ప్రజలు గత ఏప్రిల్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో బహిష్కరించారని గుర్తు చేశారు. వీరి ఆగడాలతో శ్రీ సోమవంశీ సహస్రార్జున్‌ క్షత్రీయ సమాజ్‌ అభివృద్ధి పనులు కుంటుపడ్డాయని వారు ఆరోపించారు. దీంతో ఎస్‌ఎస్‌కే సమాజ్‌ సభ్యుడు జమన్‌ నర్సింగ్‌ కోర్టును ఆశ్రయించగా న్యాయ స్థానం 12 మందితో కూడిన పేర్లను ప్రకటించిందని పేర్కొన్నారు. ప్రకటించిన పేర్లలో కార్యనిర్వాహక అధ్యక్షుడు నగరి లక్ష్మీనారాయణ్‌, నగరి సురేందర్‌, చవాహాన్‌ యశ్వంత్‌రావు, పెండు నర్సింగ్‌రావు, పవార్‌ గణేశ్‌, విశ్వనాథ్‌ లక్ష్మీనారాయణ్‌, గుడి శ్రీనివాస్‌, గణేశ్‌ చవాన్‌తో పాటు తమ నలుగురి పేర్లు ఉన్నాయని వారు తెలిపారు. కార్యదర్శిగా 14 ఏళ్ల పాటు ఉన్న కాటిగర్‌ శంకర్‌, శివరతన్‌ తమ సంఘం నిధులను కోట్లలో కొల్లగొట్టి లెక్కలు చూపలేదని ఆరోపించారు. అయితే న్యాయస్థానం ఎన్నికల కోసం అవసరమయ్యే ఓటర్‌ నమోదు కార్యక్రమాన్ని యథావిధిగా కొనసాగించాలని సూచించిందని వారు తెలిపారు.

ఘనంగా స్వాగతం పలుకుతాం



స్పోర్ట్స్‌ అథారిటీ చైర్మన్‌ శివసేనారెడ్డిని సన్మానించిన పారా క్రీడాకారులు

గన్‌ఫౌండ్రీ: పారా ఒలంపిక్స్‌లో బ్రాంజ్‌ మెడల్‌ సాధించిన క్రీడాకారిని జీవన్‌ దీప్తికి ఎయిర్‌పోర్టు నుంచి ఘనంగా స్వాగతం పలుకుతామని స్పోర్ట్స్‌ అథారిటీ చైర్మన్‌ శివసేనా రెడ్డి తెలిపారు. రవీంద్రభారతీలో పారా స్పోర్ట్స్‌ అసోసియేషన్‌ ఆఫ్‌ తెలంగాణ ఆధ్వర్యంలో స్పోర్ట్స్‌ అథారిటీ చైర్మన్‌ శివసేనా రెడ్డి, దివ్యాంగుల కార్పొరేషన్‌ చైర్మన్‌ ముత్తినేని వీరయ్యను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శివసేనా రెడ్డి మాట్లాడుతూ.. దీప్తికి క్రీడాశాఖ తరఫున రూ.5 లక్షలు అందజేస్తామన్నారు. రాబోయే నూతన క్రీడా పాలసీలో పారా క్రీడలను చేర్చడంతో పాటు ఒక ప్రత్యేక అధికారిని పారా క్రీడల కోసం కేటాయిస్తామని తెలిపారు. వీరయ్య మాట్లాడుతూ.. పారా క్రీడాకారులందరికీ దివ్యాంగులకు అందించే పరికరాల్లో ప్రత్యేక రిజర్వేషన్ల అమలు కోసం ప్రయత్నం చేస్తానని హామీనిచ్చారు. అనంతరం పలువురు క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో పారా స్పోర్ట్స్‌ అసోసియేషన్‌ ఆఫ్‌ తెలంగాణ అధ్యక్షుడు సింగారపు బాబు, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్‌, సలహాదారులు సంజీవయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా ట్రాన్స్‌జెండర్‌ సంఘాల జేఏసీ నిరసన

కవాడిగూడ: కోల్‌కతాలోని ఆర్జీకార్‌ మెడికల్‌ కాలేజీ జూనియర్‌ డాక్టర్‌ హత్యాచార నేరస్తులను రక్షిస్తున్న కోల్‌కతా పోలీస్‌ కమిషనర్‌ను తొలగించాలని బుధవారం రాత్రి హైదరాబాద్‌ మహిళా ట్రాన్స్‌జెండర్‌ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ (జేఏసీ) డిమాండ్‌ చేసింది. లోయర్‌ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ విగ్రహం వద్ద మహిళల రక్షణ కోసం పోరాడదాం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు ఝాన్సీ, సంధ్య, అనసూయ, సజయ, జ్యోతి, కృష్ణకుమారి, శ్రీదేవి, వరలక్ష్మి, దీప తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

గోల్కొండ: మిత్రులు, శ్రేయోభిలాషుల సహకారంతో 900 రోజులుగా నిరాటంకంగా ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద నిరుపేద రోగులు, వారి సహాయకులకు అన్నదానం చేస్తున్నామని గోల్కొండ ప్రభుత్వ బాలుర సెకండ్‌ లాన్సర్‌ ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం మహ్మద్‌ బషీర్‌ అన్నారు. బుధవారం గపలు ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద అన్నదానాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులు, వారి సహాయకులకు భోజన ప్యాకెట్లతో పాటు తాగునీటి బాటిల్స్‌ అందించారు.



అన్నదానం చేస్తున్న మహ్మద్‌ బషీర్‌ తదితరులు

కండరాల బలహీనతను ప్రాథమిక దశలోనే గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్‌ సంతోష్‌కుమార్‌

నాంపల్లి: జన్యుపరంగా సంక్రమించే కండరాల బలహీనతను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే వ్యాధి నివారణ సాధ్యవుతుందని పలువురు వైద్య నిపుణులు పేర్కొన్నారు. రెడ్‌హిల్స్‌లోని నిలోఫర్‌ ఆసుపత్రిలో కండరాల బలహీనత (డుచెన్‌ మస్కులర్‌ డిస్ట్రోఫీ)–డీఎండీ అనే అంశంపై బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఇండియన్‌ అసోసియేషన్‌ ఆఫ్‌ పీడియాట్రిక్స్‌, నేషనల్‌ నియోనటలాజికల్‌ ఫోరం, గ్లోబల్‌ అమ్యూమినీ, సుషేన్‌ హెల్త్‌ ఫౌండేషన్‌, నిలోఫర్‌ ఆసుపత్రి హైదరాబాద్‌ సంస్థల సంయుక్తాధ్వర్యంలో భారత్‌ ఎండీడీ ఫౌండేషన్‌ సహకారంతో నిర్వహించారు. జాతీయ వైద్య కమిషన్‌ సభ్యుడు డాక్టర్‌ సంతోష్‌కుమార్‌, మానసిక వైద్య నిపుణుడు డాక్టర్‌ సుగుణాకర్‌ రెడ్డి, నిలోఫర్‌ ఆసుపత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ రవికుమార్‌, తెలంగాణ నేషనల్‌ నియోనటాలజికల్‌ ఫోరం అధ్యక్షుడు డాక్టర్‌ యాదయ్య, పీడియాట్రిక్‌ న్యూరాలజీ వ్యాధి నిపుణులు డాక్టర్‌ లింగప్ప, డాక్టర్‌ కరుణ హాజరయ్యారు. డాక్టర్‌ సంతోష్‌కుమార్‌ మస్కులర్‌ డిస్ట్రోఫీ పోస్టర్‌ను ఆవిష్కరించి డీఎండీ వ్యాధి లక్షణాలు, ప్రారంభ సంకేతాలు, రోగ నిర్ధారణపై శిశు వైద్యులకు అవగాహన కల్పించారు. ప్రపంచవ్యాప్తంగా 5 వేల మంది అబ్బాయిల్లో ఒకరిని ఈ వ్యాధి ప్రభావితం చేస్తుందన్నారు. ఇది పూర్తిగా జన్యుపరంగా సంక్రమిస్తుందని చెప్పారు. పురుషుల్లో ఎక్కువగా అస్థిపంజరం, ఊపిరితిత్తులు, గుండె కండరాలను బలహీన పరుస్తుందని చెప్పారు. శిశు వైద్యులు వ్యాధి ప్రారంభ దశలోనే గుర్తించి, తల్లిదండ్రులకు వ్యాధి గురించి తెలియజేయాలని సూచించారు.